ఎక్క డుంది లోపం?'

ముందున్న రోడ్డంతా తాటి కాయంత అక్షరాలతో ఆ ప్రశ్న ఓ రణ నినాదంలా పెయింట్ చేసి ఉన్న ట్లనిపించింది జయంత్‌కు.

డిసెంబరు నెల సాయం సమయపు చల్ల గాలి తెరచి ఉన్న మారుతి కిటికీల్లోంచి బలంగా తాకుతున్నా, అతని నుదుట చెమట పోస్తూనే ఉంది.



దాసరి అమరేంద్ర

# నిప్పూ - నీరూ

రోడ్డు మీద అనంత అక్షర ప్రవాహంలా కనిపిస్తున్న ఆ ప్రశ్న బారి నుండి తప్పించుకోవడానికి దృష్టిని రోడ్డు కిరువైపులా ఉన్న చెట్ల మీదకు మళ్లించాడు.

అదే ప్రశ్న రెండుపక్కలా బ్రహ్మాండమైన బ్యానర్ల మీద రాసి ఉన్న ట్లనిపించింది. మనస్సు నిండా అదే ప్రశ్న. వామనుడి పాదంలా ప్రపంచ మంతా ఆవహించిన ఆ ప్రశ్న ...

ఈ నాటిది కా దిది. రెండేళ్ల క్రితం తాను తమ కుటుంబ యాజమాన్యంలో నడుస్తున్న ఆ పరిశ్రమల నిర్వహణను చేపట్టిన క్షణం నుంచీ ఆ ప్రశ్న సూక్ష్మ రూపంలో కనిపిస్తూనే ఉంది. మర్రి విత్తు మహావృక్ష మైనట్లుగా ఈ రెండేళ్లలో అది విరాడ్రూపం దాల్చింది.

ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరైన జయంత్‌కు ఊపిరి సలపని స్థితిలో మారుతి 'శాంతి కుటీరం' ముం దాగింది. సమస్యల సంగ తెలా ఉన్నా, అక్కడి ప్రశాంత వాతావరణమూ, ప్రకృతి సౌందర్యమూ చూసి ప్రాణం లేచొచ్చిన ట్లనిపించింది. మండు టెండలో నడిచి వచ్చి చల్లని మంచి నీరు తాగిన అనుభూతి కలిగింది.

'తనలోనూ కాస్తంత భావుక తుందన్న మాట' అని ఆశ్చర్య పడ్డాడు జయంత్.

* * *

రాఘవ గారు పారిశ్రామిక ప్రపంచంలో కడుగుపెట్టడం అనుకోకుండా జరిగింది. జాతీయ వాదం మీదా, అభ్యుదయ నినాదాల మీదా సానుభూతి ఉన్న క్రియాశీల కార్యకలాపాలకు ఆమడ దూరంలో ఉండే దా కుటుంబం.

దేశానికి స్వతంత్రం వచ్చిన రోజు లవి. రాఘవ కప్పటికి పద్దెనిమి దేళ్లు. తమ కుటుంబపు తటస్థ వాదం మీద ఎంతో కొంత అసహనం ఏర్పడుతోన్న సమయ మది!

తాను బియ్యే రెండో సంవత్సరం చదువుతున్న బందరు నోబుల్ కాలేజి డిబేటు ఒక దాంట్లో 'నవ భారత నిర్మాణం' అన్న విషయం మీద ఆవేశంగా మాట్లాడేసి బహుమతి పుచ్చుకున్న రాఘవ భుజం తట్టి ఆప్యాయంగా ఇంగ్లీషు మాస్టారు అన్న మాటలు అతని జీవితాన్ని అనుకోని మలుపు తిప్పాయి.

"ఈ ఆవేశమూ, ఆవేదనా మాటలకే పరిమితం చేయడ మెందుకూ? చేతల్లోకి దింప రాదూ? మన తెలుగు దేశంలో పరిశ్రమలు లేనే లేవు. ఏదైనా పరిశ్రమ ఆరంభించరాదూ? పదిమందికీ పని కల్పించిన వాడ వవుతావు, దేశాని కో వెల లేని బహుమతి నందించిన వాడ వవుతావు."

తానా? పరిశ్రమా? నడపగలడా? సాధ్యమేనా?

వందల వేల అనుమానాలు చుట్టుముట్టినా వా టన్నిటినీ ఛేదించుకుని ముందుకు సాగాడు రాఘవ. 'మన కే పను లూ అచ్చిరావు' అన్న నాన్న మాటల్ని తోసిరాజని చిన్న ఎత్తున 'రాఘవా సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్'

అన్న సంస్థను డిగ్రీ పూర్తవగానే ఆరంభించాడు - పంతొమ్మిది వందల యాభై ఒకటిలో.

అప్పటి దాకా అన్ని కళాశాలలూ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఫిజిక్స్ లాబ్ పరికరాలను - సున్నితపు త్రాసులు, మైక్రోస్కోపులు, లఘు లోలకాలు తయారు చేయడం మొదలు పెట్టాడు. అయిదేళ్ల ఆటుపోట్లకు, ఒడిదొడుకులకూ గురైనా చివరికి నిలదొక్కుకో గలిగాడు. సామాజిక స్పృహ, అభ్యుదయ భావాలూ నిండిన ఆయన పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షించింది, ఆకట్టుకుంది. కళాశాలలూ, విశ్వవిద్యాలయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా అప్పట్లో స్థాపితమైన అనేకానేక ప్రభుత్వరంగ ప్రయోగ శాలల్లో సైతం 'పరికరాలు' అంటే 'రాఘవ' అన్నంతగా ఆయన పేరు ముడిపడి పోయింది.

ఓ చిరు సెలయేరులా ఆరంభమైన ఆ సంస్థ నలభై రెండు సంవత్సరాల సుదీర్ఘ వ్యవధిలో ఓ మహానదిలా రూపొందింది. మహానదులు అనంత జలధిలో తాదాత్మ్యం చెందే ముందు నలుదిశలకూ పాయలుగా విస్తరించి విశాల భూభాగాన్ని పునీతం చేసే రీతిలో రాఘవగారి పరిశ్రమ బందరుకే పరిమితం కాకుండా ఆంధ్ర దేశ మంతటా శాఖోపశాఖలుగా విస్తరించి తెలుగు దేశపు అతి ముఖ్యమైన పరిశ్రమగా రూపొందింది.

పెద్దబ్బాయి జయంత్ తండ్రి వ్యాపార దక్షతను పుణికి పుచ్చుకున్నాడనే చెప్పాలి. కాకినాడలో ఇంజనీరింగూ, అహమ్మదాబాద్‌లో మానేజిమెంటూ ముగించి, పంతొమ్మిది వందల డెబ్భై నాటికల్లా తమ పరిశ్రమను తానే నిర్వహించగల సామర్థ్యం సంతరించుకున్నాడు.

మహానదిలా తెలుగుదేశాన్ని ప్రభావితం చేస్తున్న తమ సంస్థను ఓ అనంత జలధిగా మార్చి దేశ మంతటిలోనూ, ఆ తర్వాత విదేశాలలోనూ తమ విజయ కేతనాన్ని ఎగరవేయాలన్న తహతహ మొదలైంది జయంత్‌లో. అది గమనించాడు రాఘవ. అప్పటికే ఆయనకు అరవై ఆరు నిండాయి. మర్యాదగా కొడుక్కి వ్యాపారం అప్ప జెప్పి, దివి సీమలో కృష్ణా తీరాన ఓ మారు మూల ప్రదేశంలో విశాలమైన ఆవరణలో ఓ చక్కని కుటీరం నిర్మించుకుని ప్రశాంతంగా రోజులు గడపసాగాడు.

* * *

జయంత్ ఉత్సాహం మూర్తీభవించిన మనిషి.

సాంకేతిక శాస్త్రంలో నిష్ణాతుడు. మానేజిమెంటులో పట్టభద్రుడు. అవసర మనిపిస్తే వ్యాపారంలో ఎంతటి రిస్కైనా తీసుకోగల గుండె దిటవు గలవాడు. అంతర్జాతీయ రంగంలో పేరు సంపాదించి తండ్రిని మించిన కొడుకు ననిపించుకోవాలన్న తాపత్రయంలో చకచకా నిర్ణయాలు తీసేసుకుంటూ టకటకా నిచ్చెన లెక్కేయ్యాలన్న తపన గలవాడు.

తన లక్ష్య సిద్ధి కోసం రోజుకు పద్దెనిమిది గంటలు పని చేయాల్సి వచ్చినా సంతోషంగా సిద్ధపడ్డాడు. కుటుంబాన్నీ, నాలుగేళ్ల కూతుర్నీ అశ్రద్ధ చేయాల్సి వచ్చినా అంతగా బాధపడ లేదు. అతనికి తమ సంస్థ పురోగతే ఏకైక లక్ష్య మైంది.

కానీ తాను సంస్థను చేపట్టిన కొద్ది కాలానికే విపరీత ఫలితాలు కనిపించడం మొదలైంది. ముందుకు దూసుకు పోవలసింది పోయి, సంస్థ కొంత కాలం స్తబ్ధ మైంది. మరి కొన్నాళ్లకు వెనక కాళ్ల దౌడు మొదలైంది.

ఎక్క డుంది లోపం?

తన నిరంతర కృషీ, నిజాయితీ, పట్టుదలా, లక్ష్య శుద్ధీ సంస్థను ముందుకు తీసుకు పోవలసిందిపోయి పరిస్థితి ఎందుకు దిగజారు తోందో జయంత్‌కు అర్థం కాకుండా పోయింది. ఆత్మశోధన చేసుకున్నాడు. ఫలితం లేకపోయింది. సహచరులనూ, అహమ్మదాబాద్ ఆచార్యులనూ సంప్రదించాడు. ప్రయోజనం లేకపోయింది. పైకంతా బాగానే ఉన్నట్టుంది; బండి చూస్తే వెనక్కి నడుస్తోంది.

తన ఊహకు అందని ఆ లోపాన్ని వెదికి పట్టుకోవడం కోసం తండ్రిని సంప్రదించడమే మంచి దనిపించింది.

మాయాబజార్ సినిమాలో అభిమన్యునికి రథం


మీరు మా ఈ కార్యక్రమాన్ని స్టార్, జీ, డిడి, ఎటిఎన్ టీవీలలో ముంబయి మరియు ఢిల్లీలో మరియు బిబిసిలో చూడవచ్చును

బెర్కొవిట్స్ అద్భుతాలు

తక్షణం సన్నబడు మరియు దేహదారుఢ్యం పెంచే కార్యక్రమం: మీరు ఎందుకు స్థూల కాయులవుతున్నారు? హార్మోనుల సమతౌల్యం లేకపోవుట వలనా? ఎక్కువగా తినడం వలనా? వంశపారంపర్యంగా వస్తోందా లేదా నీరు పట్టడం వలన వస్తోందా? మా కంప్యూటరైజ్డ్ బాడీ ఎనాల్సిస్ ద్వారా సమస్యకు గల అంతర్గత మరియు బహిర్గత కారణాలను పరిశీలించి తదనుగుణంగా చికిత్స చేస్తాము. మా బేసిక్/ అడ్వాన్స్‌డ్ కార్యక్రమాన్ని ఎంచుకోండి. ముడతలు పడడం మరియు కండరాలు జారిపోవుట వంటి సమస్యలకు హైటెక్ విధానం ద్వారా, శస్త్ర చికిత్స లేని అద్భుతమైన చికిత్స. మీ ముఖము, డబుల్‌చిన్, స్తనాలు మరియు పిరుదులు పైకి లేవనెత్తి చక్కబరచబడును. మొటిమలు, మచ్చలు, పిగ్మెంటేషన్ మరియు కంటిక్రింద చికిత్స చేయబడును. మా బాహ్య మరియు అంతర్గత ప్రత్యేక చికిత్స వలన సమస్య తిరిగిరాదు.

బట్టతలకు హెయిర్ వీవింగ్ నొప్పిలేని, శస్త్ర చికిత్సలేని అమెరికన్ పద్ధతిలో వెంట్రుకలకు చికిత్స: హెయిర్ వీవింగ్‌తో 2 —3 గంటలలో బట్టతల సమస్య నివారించబడును (తర్వాత మళ్లీ రావలసి ఉంటుంది) హెయిర్ బాండింగ్ (తర్వాత రానవసరంలేదు) రంగు వేసుకోవచ్చును, షాంపుతో రుద్దుకోవచ్చును. సెట్, స్టైల్, స్విమ్ చేసుకొని మీ స్వంత స్వాభావికమైన తలకట్టులాగ చూసుకోవచ్చును.

జుట్టు రాలిపోవుట/ ఎలోపెసియాకు సాటిలేని మేటి చికిత్స

వంశపారంపర్యం కాకపోతే, మా నిపుణులచే ప్రత్యేక చికిత్స చేయబడును. మీ జుట్టు పెరగడానికి దోహదం చేస్తుంది.


చికిత్సకు ముందు


చికిత్సకు ముందు


చికిత్స తర్వాత


చికిత్స తర్వాత



కళ్లు, పెదవులు మరియు బ్యూటీ స్పాట్‌లకు శాశ్వతమైన కాస్మోటిక్ మేకప్ (ఒకే సిట్టింగ్) మీ చర్మం రంగుకు సరిపడే విధంగా తెల్లమచ్చలు ఫిల్లింగ్ చేయబడును (ఒకే సిట్టింగ్) పులిపిరికాయలు, మచ్చలు మరియు పుట్టుమచ్చలు తొలగించబడును (ఒకే సిట్టింగ్)

ఇండియన్ చాప్టర్ నిర్వాహకులు:
డా. జె. మన్‌చందా
అడ్వాన్స్‌డ్ బ్యూటీకేర్‌లో గోల్డ్ మెడలిస్ట్, అంతర్జాతీయ అవార్డుల విజేత



BERKOWITS CLINICS
The fountain of youth
For men & women

హైదరాబాదు: 301, 302 III అంతస్తు, మహేశ్వరీ టవర్సు, తాజ్‌రెసిడెన్సీ సమీపాన, రోడ్డు నెంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాదు —34 ఫోను 3301503, 3324276.

★ ఢిల్లీ: టెలిఫోన్ 3711571 ★ ముంబయి బాంద్ర (వెస్ట్) టెలిఫోన్ 6431390, జె.వి.పి.డి. స్కీము టెలిఫోన్ 6286537, కఫెపరేడ్ టెలిఫోన్ 2184185 ★ బెంగుళూరు టెలిఫోన్ 5293090

శనివారం సెలవుదినం

దారి పొడుగునా రాక్షస మాయ వినిపించినట్టుగా ,హైదరాబాదు నుంచి హంసల దీవి దాకా జయంత్ ను 'లోప మెక్కడ?' అన్న ప్రశ్నే వెంటాడి వేధించింది.

చిరు చీకట్లు ముసురుకుంటున్న వేళ శాంతి కుటీరం చేరాడు జయంత్.

* * *

తన ఆశ్రమం ఆవరణలో ఓ బండ రాతి మీద కూర్చుని సాయం సమయపు కృష్ణ వైపు తదేకంగా చూస్తున్న తండ్రి దగ్గరకు చేరి ఉపోద్ఘాతాల నిమిత్తం లేకుండా తన గోడంతా ఏకబిగిన చెప్పుకున్నాడు జయంత్. సహచరులతోనూ, ఆచార్యులతోనూ అంతకు ముం దీ విషయం చర్చించినప్పుడు వ్యాపార సరళిలోనే మాట్లాడాడు కానీ, తండ్రి దగ్గర బిడియాలనూ, సంశయాలనూ అవతలపెట్టి తన భావాలను, అనుభవాలను, భయాలను, పరాజయాలను స్పష్టంగా, తేటతెల్లంగా విప్పి చెప్పాడు.

అంత పెద్ద వ్యాపార వేత్తా భావోద్వేగంలో కళ్ల నీళ్ల పర్యంత మయ్యాడు.

తండ్రి అభిప్రాయం కోసం, సలహా కోసం చెవులు రిక్కించాడు.

రాఘవ ఒక్క మాటైనా మాట్లాడ లేదు. అసలు పెదవి విప్ప లేదు. ఓ చిరునవ్వు మాత్రం పెదవి దాటింది. జయంత్‌ను తనతో రమ్మని సైగ చేశాడు.

చీకటి వెలుగును పూర్తిగా జయించేసింది. శుక్ల త్రయోదశి చందమామ తిమిరంతో తన సమరానికి ఆయత్త మవుతున్నాడు. కృష్ణోపరితలం మీదుగా కానవస్తున్న ఆ చంద్రోదయ దృశ్యం ఎంతో మనోహరంగా అనిపించింది జయంత్‌కు. ఆ ఆవరణలో దక్షిణం వైపు ఉన్న తాటి తోపు మధ్యకు చేరారు ఆ తండ్రీకొడుకులు.

"చలిగా ఉంది కదూ! చలి మంట వేసుకుందామా?"

చిన్నతనం గుర్తొచ్చింది జయంత్‌కు. ఇంకా పట్నం వాసనలు సోకని అప్పటి బందరులో డిసెంబరు, జనవరి నెలల్లో 'సంక్రాంతి నెల' పట్టడం, రోజా అక్కతో కలిసి గొబ్బెమ్మలను పెట్టడం, తండ్రితో పాటు వేకువ జామున చలిమంటలు కాగడం ...

తోటమాలి చితుకులు పోగేసి మంట అంటించాడు.

వేనవేల నాలుకలతో తాండవ నృత్యం చేస్తున్న ఆ అగ్నిజ్వాలల భుగభుగలను గమనిస్తూ వా రిద్దరూ ఆ రాత్రంతా గడిపేశారు. మంటను మామూలు స్థాయిలో ఉంచకుండా తండ్రి ఎండు కట్టెలను, చితుకులను పదే పదే వేస్తూ తార స్థాయిలో ఎందు కుంచాడో అర్థం కాలేదు జయంత్‌కు.

భళ్లున తెల్లారింది. మంట చప్పగా చల్లారింది. రాఘవ లేచి నదీ తీరం దగ్గరికి నడిచాడు. జయంత్ వెంట వెళ్లాడు.

అది నదో, సముద్రమో అంతు బట్టనంత విశాలంగా అవతలి గట్టు కంటికి అనని రీతిలో కనిపించింది కృష్ణవేణి. మరో మైలు ముందుకు సాగితే సాగర సంగమమే! నిండుగా, ప్రశాంతంగా ముందుకు సాగిపోతోం దా నదీమ తల్లి.

తదేకంగా నది వైపు చూసి చూసి చిట్టచివరికి రాఘవ అడిగాడు -

" నీ సమస్యలకూ, వైఫల్యానికీ కారణం అర్థమైందా?"

ఊహించని ఆ ప్రశ్న ఆశ్చర్యంలో ముంచింది జయంత్‌ను.

"నాన్నా! మీరు చెప్ప దలచుకున్న దేమిటో నా కర్థం కావడం లేదు."

"ఆలోచించవయ్యా! ఆలోచించు. సరైన కోణంలోంచి చూస్తే విషయం స్పష్టంగా కనబడుతుంది."

మౌనమే గతయింది జయంత్‌కు.

"తమ అపార శక్తిసామర్థ్యాలను చూసి మిడిసి మిడిసి పడుతూ ఆకాశాన్ని అందుకోవాలని రాత్రంతా ప్రయత్నించిన అగ్ని జ్వాలల్ని చూశావు కదూ! అవి చేసిన విలయతాండవం గమనించావు కదూ! ఆ సమయంలో ప్రపంచంలోని ఏ శక్తీ ఆ అగ్ని జ్వాలలకు సాటి కాదు కదూ! పెద్ద పెద్ద వృక్షాల్నీ, మృగరాజాలనూ అది అతి సులువుగా కబళించేసేది కదూ!

"మరి ఆ నిండు నదిని చూడు, ఎక్కడో పడమటి కనుమలో ఓ చిరు ధారగా పుట్టిం దా నది.న కొండలూ, కోనలూ, పేటలూ బాటలూ దాటుకుని తన దారిలో తారసిల్లిన అన్ని ప్రదేశాలనూ తన చల్లని చేతులతో తనివి తీరా ఆలింగనం చేసుకుంటూ, మృదువుగా, నెమ్మదిగా, నిండుగా సాగి సాగి ఇప్పుడు సాగర సంగమానికి సిద్ధ పడుతోంది. ఇంత చేసినా దాని దృష్టి నేలను దాటి పోలేదు. ఆకాశాన్ని ఆక్రమించాలని, చుక్కలను తుంచుకు రావాలనీ అ దెన్నడూ ఆశ పడలేదు. వినవడీ వినపడని పద సవ్వడీ, తాకినా నొప్పి కలగని మృదు శీతలత్వమూ ముఖ్య లక్షణాలు.

"మరి ఆ అగ్ని జ్వాలల అంతిమ లక్ష్యం ఏమిటి? చివరకు మిగిలింది పిడికెడు బూడిదే కదూ! చుట్టు పక్కల ఉన్న సమస్త జీవ రాశినీ మట్టుపెట్టడమే కాకుండా చిట్టచివర కా అగ్ని జ్వాలలు తమను తామే సర్వనాశనం చేసుకోలేదూ?"

చెప్పడ మాపి, జయంత్ వైపు ఓ క్షణం ఆప్యాయంగా, సాభిప్రాయంగా చూసి రాఘవ వివరణ కొనసాగించాడు.

"అదిగో, ప్రకృతి నేర్పే ఈ పాఠాలు మన జీవితాలకూ ఎంతో వర్తిస్తాయి. మనుషుల మనుగడకు ఆధార భూతం అగ్ని జ్వాలలు కాదు; నదీ నదాలు, జలాశయాలూను. మండే సూర్యుడి లాంటి వారి కన్నా, నమ్రతా, అంతశ్శక్తీ ఉన్న పెద్ద మనసు వాళ్లు, తమ చుట్టూ ఉన్న వారికి ఎక్కువ మేలు చేయ గలుగుతారు. వాళ్ల అభిమానం పొంద గలుగుతారు. వాళ్ల కష్టాలను అర్థం చేసుకో గలుగుతారు. బాధలతో బీటలు వారిన వాళ్ల గుండెలో కరుణ రసం నింప గలుగుతారు. తమ సంస్థల పురోగమనానికీ, సుఖసౌఖ్యాలకూ కారణ భూత మవుతారు."

"మరి ను వ్వే కోవకు చెందిన వాడివో నీ మనసు నడుగు. నీ సందేహాలకూ, ప్రశ్నలకూ దానంతటదే సమాధానం దొరుకుతుంది."

మెరుపులా కళ్ల ముందు మెరసిన సత్యం జయంత్ మనసును సూటిగా, బలంగా తాకింది. అతని దురహంకారాన్ని చుట్టచుట్టి గిరవా టెట్టింది.

నమ్రతతో తన మానస సరోవరం పొంగి పొరలగా విప్పారిన కళ్లతో తూర్పు దిశగా దృష్టి సారించాడు జయంత్. కృష్ణోపరితలం మీద ఉదయిస్తున్న సూరీడు వినా తక్కిన ప్రపంచ మంతా క్షణకాలం తన ఉనికిని కోల్పోయిన ట్టనిపించిం దతనికి.

